# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శుక్రవారం 23 మే 2025 పేజీలు 8


# పాక్‌తో యుద్ధం ఆగిపోలే.. అప్పటి వరకు చేస్తూనే ఉంటాం



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్?తో యుద్ధం ఆగిపోలేదని.. ఆ దేశం ఉగ్రవాదాన్ని పోషించినన్నాళ్లు వార్ చేస్తూనే ఉంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ తేల్చి చెప్పారు. భారత్ ఉఫ్ మని ఊదితే పాకిస్తాన్ ఖతమైపోతదని హెచ్చరించారు. పాక్?తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నదనే తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని.. భారత సైన్యానికి బాసటగా నిలవండని పిలుపునిచ్చారు. కొంచెం వర్షం పడగానే మనం తడవకుండా దాచుకుంటాం.. కానీ సరిహద్దుల్లో మంచు, వాన, ఎండ, చలికి వెరవకుండా పోరాడుతున్న సైనికులకు హ్యాట్సాఫ్ చెబుతున్నానన్నారు. గురువారం (మే 22) కరీంనగర్?లో బండి సంజయ్ హిందూ ఏక్తా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న కుహానా లౌకిక వాదులకు వార్నింగ్ ఇవ్వడానికే హిందూ ఏక్తా యాత్ర నిర్వహిస్తున్నామని.. భారీ వర్షాన్ని లెక్క చేయకుండా తరలివచ్చిన ప్రజలందరికీ హ్యాట్సాఫ్ చెబుతున్నానని అన్నారు. ఆపరేషన్ సింధూర్?లో మహిళా సైనికుల చూపిన వీరోచిత పోరాటాలు భేష్ అని కొనియాడారు. భార్య ముందు భర్తను, పిల్లల ముందు తండ్రిని, తల్లి ముందు కొడుకును పెహల్గాంలో ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపారని.. అందుకే పాకిస్తాన్?పై దాడి చేసి ప్రధాని -2 లో

# తెలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాలు
# కేఆర్ఎంబీ కీలక ఉత్తర్వులు




-2 లో

- వేసవి అవసరాలకు తెలుగు రాష్ట్రాలకు నీటి విడుదల
- ఏపీకి 4, తెలంగాణకు 10.26 టీఎంసీలు కేటాయింపు
- కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆదేశాలు జారీ
- శ్రీశైలం, సాగర్‌లో నీటి వినియోగానికి నిర్దిష్ట స్థాయిలు

**హైదరాబాద్ పెన్ పవర్:**వేసవి దృష్ట్యా పెరుగుతున్న నీటి అవసరాలను పరిగణలోకి తీసుకుని, తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కృష్ణా జలాలను విడుదల చేయడానికి కృష్ణా నదీ యాజమాన్య

# బీఆర్ఎస్‌లో చీలికలకు కవిత లేఖే నిదర్శనం.. కేటీఆర్ ఆన్సర్ చెప్పాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలో వర్గ విభేదాలు ఉన్నట్లు గత కొన్ని రోజులుగా తెలంగాణ పాలిటిక్స్?లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఆ పార్టీలో మూడు ముక్కల ఆట నడుస్తోందని.. బీఆర్ఎస్ టాప్ లీడర్స్ కవిత, హరీష్ రావు, కేటీఆర్ మధ్య విభేధాలు తారాస్థాయికి చేరుకున్నాయని రాజకీయ వర్గాల్లో వార్తలు గుప్పుమంటున్నాయి. ఎవరికి వారే అన్న చందంగా ఆ పార్టీలు పరిస్థితి తయారైందని.. కవిత, హరీష్ రావు వేరు కుంపటి పెట్టడానికి సిద్ధమయ్యారని తెలంగాణ పొలిటికల్ కారిడార్లలో వార్తలు కోడైకూస్తున్నాయి. -2 లో

# సీఎం రేవంత్ రెడ్డి పేరుతో బ్లాక్ మెయిలింగ్.. మాజీ క్రికెటర్ నాగరాజు అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం రేవంత్ రెడ్డి పేరుతో మోసాలకు పాల్పడుతోన్న మాజీ క్రికెటర్?ను అరెస్ట్ చేసి కటకటాల్లోకి నెట్టారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్?లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన బుడుమురూ నాగరాజు అనే వ్యక్తి క్రికెటర్. గతంలో ఇతడు రంజీ మ్యాచులు కూడా ఆడినట్లు సమాచారం. ఏమైందో తెలియదు గానీ నాగరాజు పక్క దారి పట్టాడు. క్రికెట్?కు వీడ్కోలు పలికిన అడ్డదారుల్లో సంపాదించడంపై ఫోకస్ పెట్టాడు. ఈ క్రమంలోనే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఓఎస్డీగా నకిలీ అవతారం ఎత్తాడు.తాను సీఎం రేవంత్ రెడ్డి ఓఎస్డీని అంటూ ర్యాపిడో, కంట్రీ డిలైట్ ఎండీలకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. పలు రియల్ ఎస్టేట్ కంపెనీ -2 లో

# మావోయిస్టు పార్టీ కొత్త చీఫ్ ఎవరు..? తెరపైకి ఇద్దరి కీలక నేతల పేర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** మావోయిస్టు పార్టీ అఖిలభా రత ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతి తర్వాత ఆ పార్టీ కొత్త చీఫ్ ఎవరనే చర్చ మొదలైంది. అత్యున్నత హొదా లో ఉన్న ఆయన ఎన్ కౌంటర్‌లో మృతి చెందడం మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బ. కొత్త ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవుజీ, మల్లోజుల వేణుగోపాల రావు అలియాస్ సోను పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ రెండు పేర్లపై ప్రధానంగా ఇంటెలిజెన్స్ వర్గాలు దృష్టి పెట్టాయి. తిరుపతి మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్‌కు అధిపతిగా ఉన్నారు. ఇది పార్టీ సాయుధ విభాగం. ఇక వేణుగోపాలరావు పార్టీ సైద్ధాంతిక విభాగానికి -2 లో

## పాక్‌తో యుద్ధం ఆగిపోలే.. అప్పటి వరకు చేస్తూనే ఉంటాం

- మొదటి పేజి తరువాయి

మోడీ భారత్ సైన్యం సత్తాను చాటి చెప్పారన్నారు. భారత సైన్యానికి సంఘీభావంగా, ప్రధాని మోడీకి మద్దతుగా హిందూ ఏక్తా యాత్ర ర్యాలీని కొనసాగిద్దమన్నారు. హిందూ ఏక్తా యాత్రకు తరలివచ్చిన ఈ జనాన్ని చూస్తుంటే నాలో రక్తం ఉరకలేస్తోందని.. మీ కోసం ఏందాకైనా పోరాడాలన్పిస్తోందన్నారు. ఇక నుంచి రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తానని అన్నారు. పెహల్గాం ఉగ్రదాడి తర్వాత హిందువుల్లో ఐక్యతగా ఉండాలనే ఆలోచన వచ్చిందన్నారు. ఉగ్రవాదులు మతం అడిగి బట్టలిప్పి హిందువని తెలిశాకే చంపేశారని.. ఈ చర్యకు కౌంటర్?గా ప్రధాని మోడీ ఏం చేశారో చూశారో తెలుసు కదా.. పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లి ఆ ఉగ్రవాదులను అంతమొందించారని గుర్తు చేశారు. ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేశామన్నారు. అమెరికా ట్విన్ టవర్స్?పై అల్ ఖైదా దాడి చేసి 6 వేల మందిని చంపితే.. 10 ఏళ్ల దాకా వాళ్లు ఏమి చేయలేకపోయారని..10 సంవత్సరాల తరువాతే ఒసామా బిన్ లాడెన్?ను పట్టుకుని అమెరికా చంపింది. కానీ పెహల్గాం ఘటన జరిగిన 15 రోజుల్లోనే ఉగ్రవాదుల అంతు చూసిన చరిత్ర నా భారత సైన్యానిదని కొనియాడారు. పాకిస్తాన్?పై యుద్ధం చిన్నదని తక్కువ చేసిన మల్లికార్జున్ ఖర్గేకి సవాల్ చేస్తున్నా.. పాకిస్తాన్ లోపలకు వెళ్లి 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం చిన్న యుద్ధమా..? పాకిస్తాన్ ఆర్మీకి చెందిన 11 మిలటరీ బేస్‌లను ధ్వంసం చేయడం చిన్న యుద్ధమా..? 20 శాతం మేరకు పాకిస్తాన్ మిలటరీ మౌలిక వసతులను ధ్వంసం చేయడం చిన్న యుద్ధమా..? మన సైన్యం దెబ్బకు భయపడి యుద్ధం ఆపాలంటూ పాక్ కాళ్ల బేరానికి రావడం చిన్న యుద్ధమా? ఏది చిన్న యుద్దమో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యుద్దంలో ఎన్ని రాఫెల్ విమానాలు ధ్వంసమయ్యాయో లెక్క చెప్పాలని రాహుల్ గాంధీ మాట్లాడటం సిగ్గుచేటని ఫైర్ అయ్యారు. మన సైన్య శౌర్య పరాక్రమాలను పొగడాల్సింది పోయి తక్కువ చేసి చూపుతారా..? అంటూ మండిపడ్డారు. రాహుల్ గాంధీకి భారత దేశంలో కంటే పాకిస్థాన్?లోనే ఎక్కువ మంది అభిమానులున్నారట. పాకిస్థాన్ సోషల్ మీడియాలో రాహుల్ గాంధీ ట్రెండింగ్?లో ఉండటమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ట్రంప్?కు భయపడి ప్రధాని మోడీ యుద్ధం ఆపేసిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం సిగ్గు చేటని దుయ్యబట్టారు.

## మావోయిస్టు పార్టీ కొత్త చీఫ్ ఎవరు..? తెరపైకి ఇద్దరి కీలక నేతల పేర్లు

- మొదటి పేజి తరువాయి

చీఫ్‌గా పనిచేస్తున్నట్లు భావిస్తున్నారు. వీరిలో తిరుపతి మాదిగ వర్గానికి చెందిన వ్యక్తి కాగా, వేణుగోపాలరావు బ్రాహ్మణ వర్గానికి చెందిన వారు. పాత తరం నాయకుల్లో చాలా మంది ఇప్పటికే చనిపోయారు. ప్రస్తుతం తిరుపతికి 62 ఏళ్లు కాగా.. వేణుగోపాలరావుకు 70 సంవత్సరాల వయస్సు. వీరిద్దరూ తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారు. మావోయిస్టులు సాయుధ విభాగం నాయకుడికి పట్టం కడతారా..? సైద్ధాంతిక విభాగం నాయకత్వానికి బాధ్యతలు అప్పగిస్తారా? అనే చర్చ ఇంటెలిజెన్స్ వర్గాల్లో నడుస్తోంది.

# తెలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాలు

# కేఆర్ఎంబీ కీలక ఉత్తర్వులు

బోర్డు (కేఆర్ఎంబీ) నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వేసవి తాగునీటి అవసరాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు 4 టీఎంసీలు, తెలంగాణ రాష్ట్రానికి 10.26 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు కేఆర్ఎంబీ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నీటి వినియోగానికి సంబంధించి ప్రాజెక్టులలో నీటిమట్టాలపై కూడా బోర్డు స్పష్టతనిచ్చింది. శ్రీశైలం జలాశయంలో 800 అడుగుల వరకు, నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 505 అడుగుల వరకు నీటిని వాడుకోవడానికి అనుమతించింది. ఆంధ్రప్రదేశ్ అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడి కాల్వ ద్వారా రోజుకు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కేఆర్ఎంబీ తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ నీటి విడుదలతో వేసవిలో తాగునీటి సమస్య కొంతమేర తీరుతుందని భావిస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వ విషయంలో కూడా బోర్డు కీలకమైన సూచన చేసింది. జులై నెలాఖరు వరకు శ్రీశైలం జలాశయంలో కనీసం 800 అడుగుల నీటిమట్టాన్ని కొనసాగించాలని తమ ఉత్తర్వుల్లో స్పష్టంగా తెలిపింది. ఈ నిర్ణయాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బోర్డు వర్గాలు వెల్లడించాయి.

# బీఆర్ఎస్‌లో చీలికలకు కవిత లేఖే నిదర్శనం.. కేటీఆర్ ఆన్సర్ చెప్పాలి

- మొదటి పేజి తరువాయి

ఈ తరుణంలో బీఆర్ఎస్ పార్టీ చీఫ్ కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవిత లేఖ స్టేట్ పాలిటిక్స్?లో సంచలనం సృష్టించింది. పార్టీలోని తాజా పరిస్థితులపై తన తండ్రిని ప్రశ్నిస్తూ కవిత లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. ఓ వైపు బీఆర్ఎస్ లో చీలిక మొదలైందని అధికార కాంగ్రెస్, బీజేపీ కార్నర్ చేస్తోన్న వేళ.. ఏకంగా కేసీఆర్ కూతురే ఆయనకు లేఖ రాయడం ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. కవిత లేఖతో బీఆర్ఎస్?లో లుకలుకలు నిజమేనని చర్చ షూరు అయ్యింది. ఇదిలా ఉంటే.. తన తండ్రికి కవిత రాసిన లేఖ, అందులో ఆమె పేర్కొన్న కొన్ని అంశాలు అధికార కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మాస్త్రంగా మారాయి. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని.. ఆ పార్టీల మధ్య చీకటి ఒప్పందం ఉందని మేం చెప్పినదానికి కవిత లేఖే నిదర్శమని కాంగ్రెస్ దాడి మొదలుపెట్టింది. ఈ క్రమంలో ఎమ్మెల్సీ కవిత లేఖపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు.

గురువారం (మే 22) ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ లో చీలికలకు కవిత లేఖే నిదర్శమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పగ్గాలు కేటీఆర్?కు అప్పగిస్తారని కవిత, హరీష్ రావు ఆందోళనలో ఉన్నారన్నారు. ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసినట్లు కవిత లేఖ రాశారు.. కవిత లేఖకు కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత లేఖతో బీఆర్ఎస్ పార్టీలో జరుగుతోన్న వాస్తవాలు బయటకు వస్తున్నయన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కూడా కవిత లేఖపై రియాక్ట్ అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో ముసలం తారాస్థాయికి చేరిందని.. కవిత రాసిన లేఖతో ఆ పార్టీ లుకలుకలు బయపపడ్డాయని అన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ కలిసి పని చేస్తోందని కాంగ్రెస్ చెప్పిన మాటలను కవిత సమర్థించారని పేర్కొన్నారు. బీజేపీతో పొత్తు కోసం కేసీఆర్ సిద్ధమవుతున్నారని లేఖ ద్వారా కవిత చెప్పకనే చెప్పేశారన్నారు. కవిత లేఖపై బీఆర్ఎస్ నాయకత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఇద్దరికి మాత్రమే పరిమితమైందని కవిత లేఖతో తెలిపోయింది. హరీష్ రావు ఇంటికెళ్లి కేటీఆర్ ఆయనను బతిమాలుతున్నారు. బీఆర్ఎస్ పని అయిపోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డి పేరుతో బ్లాక్ మెయిలింగ్.. మాజీ క్రికెటర్ నాగరాజు అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

చైర్మెన్?లకు తాను రేవంత్ రెడ్డి ఓఎస్డీని అంటూ వాట్సాప్?లో మెసేజ్?లు పంపి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి ఓఎస్డీ అంటూ ఓ ఫేక్ ఈ మెయిలే క్రియేట్ చేశాడు. నాగరాజు సీఎం రేవంత్ రెడ్డి పేరుతో పలువురిని బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆ నోటా ఈ నోటా సమాచారం పోలీసులకు చేరింది. ఇంకేముంది సీఎం పేరుతోనే వసూళ్లకు పాల్పడుతున్న నాగరాజు ఆట కట్టించాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలోనే గురువారం (మే 22) శ్రీకాకుళంలో చాకచక్యంగా నాగరాజును అరెస్ట్ చేశారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు. అనంతరం అక్కడి పోలీసులకు సమాచారం అందించి.. నాగరాజును హైదరాబాద్?కు తరలించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మాజీ క్రికెటర్ నాగరాజుపై 30కి పైగా ఉన్నట్లు గుర్తించి పోలీసులు ఖంగుతిన్నారు.

## నకిరేకల్‌లో దారుణం.. గర్భిణి ప్రాణం తీసిన లింగనిర్ధారణ పరీక్షలు.. స్కానింగ్‌లో ఆడపిల్ల అని చెప్పడంతో..

**హైదరాబాద్ పెన్ పవర్:** సూర్యాపేట పట్టణంలో సాయి గణేష్ హాస్పిటల్ లో నకిలీ వైద్యుడు చేసిన వైద్యం వికటించి మహిళ మృతి చెందిన ఘటన మరువక ముందే మరో మహిళ చనిపోవడం కలకలం రేపింది. జిల్లా కేంద్రంలోని అనుమతులు లేకుండా నడిపిస్తున్న ఓ ప్రైవేట్ హాస్పిటల్లో వైద్యం వికటించి మృతి చెందిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. సూర్యాపేట జిల్లా మోతే గ్రామానికి చెందిన అనూష అనే మహిళకు పరీక్షలు గర్భంలో ఆడపిల్ల ఉన్నట్లుగా నిర్ధారించారు. మహిళకు అప్పటికే ఇద్దరు అమ్మాయిలు పుట్టడంతో లింగ నిర్ధారణ పరీక్షల కోసం ఓ ఆర్ఎంపీని ఆశ్రయించింది. ఆమెను నకిరేకల్ లోని యాదగిరి అనే వ్యక్తి దగ్గరికి తీసుకెళ్లి ఇంట్లోనే పరీక్షలు నిర్వహించారు. స్కానింగ్ లో మళ్లీ అమ్మాయి అని తేలడంతో అనుమతి లేని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అబార్షన్ చేయించుకుంది. వైద్యం వికటించి తీవ్ర రక్తస్రావం జరగడంతో అనూష అనే మహిళ చనిపోయింది. నకిరేకల్ కు చెందిన యాదగిరి అనే వ్యక్తి ఇంట్లోనే మిషన్ ఏర్పాటు చేసుకుని చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాడు. టేకుమట్ల గ్రామానికి చెందిన ఓ ఆర్ఎంపీ అనూష అనే మహిళను యాదగిరి ఇంటికి స్కానింగ్ కోసం తీసుకొచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. మహిళ రక్తస్రావంతో చనిపోయిన వార్త తెలుసుకున్న యాదగిరి పరారైనట్లు తెలిపారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు పోలీసులు.

## రూ.కోటి ఖరీదైన ఇంటిని ఇలా అప్పుచేసి కొంటే రూ.50 లక్షలు లాభం.. పూర్తి ప్లాన్ మీకోసం

**హైదరాబాద్ పెన్ పవర్:**సొంత ఇల్లు కొనుక్కోవటం అనేది ప్రస్తుత భారతదేశంలో చాలా మంది మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి ప్రజలకు ఒక కల. చాలా మంది తమ పిల్లలను చదివించటం అలాగే ఉండటానికి ఒక నివాసం ఈ రెండే భారతీయ సంస్కృతిలో దశాబ్దాలుగా ప్రజలు కోరుకుంటున్న కనీస అవసరాలు. అయితే దీనిని ఎంత తెలివిగా ప్లాన్ చేస్తామనేదే ముఖ్యం. చాలా మంది తమ వద్ద ఉన్న మొత్తం డబ్బు వెచ్చించి ఇల్లు కొంటుంటారు.. ఆ తర్వాత ఆర్థికంగా ఇబ్బందులనూ ఎదుర్కొంటుంటారు.కానీ ఇప్పుడు మనం తెలుసుకోబోతున్న ఆర్థిక ప్రణాళిక సొంతింటి కలను నెరవేర్చటంతో పాటు వారికి ఆర్థికంగానూ భారీ లాభాన్ని ఆర్జించిపెడుతుంది. ఒకవేళ మీరు కోటి రూపాయలు ఖరీదైన ఇంటిని కొనుగోలు చేయాలని అనుకుంటూ దానికి పూర్తిగా డబ్బు రూపంలో చెల్లింపు చేయాలనుకుంటున్నట్లతే రూ.50 లక్షలు లాభం తెచ్చే ప్లాన్ ఇక్కడ ఉంది. దానిని ఎలా వర్కౌట్ చేయాలో ఇప్పుడు తెలుసుకోండి.ముందుగా డౌన్ పేమెంట్ రూపంలో ఒక రూ.20 లక్షలు చెల్లించి, మిగిలిన 80 శాతం మొత్తాన్ని బ్యాంక్ నుంచి 10 ఏళ్ల కాలానికి హెూమ్ లోన్ తీసుకోవటం ఉత్తమం. ఎందుకంటే ఇటీవలి కాలంలో రిజర్వు బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించిన తర్వాత దేశంలోని అనేక ప్రభుత్వ ప్రైవేటు బ్యాంకుల్లో గృహ రుణాలపై వడ్డీ రేట్లు 8 శాతానికి చేరాయి. అంటే రూ.80 లక్షల రుణంపై రూ.41లక్షల 60వేలతో కలిపి చివరికి మీరు రూ.కోటి 21లక్షల 60వేల వరకు బ్యాంక్ నుంచి తీసుకున్న రుణానికి చెల్లింపు చేస్తారు. అయితే ఇక్కడ లాభం ఎక్కడిది రూ.21 లక్షలు లాస్ అనుకుంటున్నారా.. అసలు కిటుకు ఇక్కడే ఉంది. ఇక్కడ చేయాల్సిందల్లా మీ వద్ద ఉన్న రూ.80 లక్షల క్యాష్ మొత్తాన్ని సురక్షితమైన బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేయండి. దీనిపై కూడా 7 శాతం చొప్పున వడ్డీ వచ్చినట్లయితే డిపాజిటర్లకు హెూమ్ లోన్ చెల్లించే 10 ఏళ్ల కాలంలో.. రూ.92లక్షల 71వేల వరకు వడ్డీ ఆదాయం పొందుతారు. అంటే ఇక్కడ మీ రూ.80 లక్షలు కాస్త రూ.కోటి 72లక్షల 71వేలుగా మారిపోతుంది. ఇలా చూస్తే మీరు బ్యాంక్ నుంచి రుణం తీసుకుని చేసే చెల్లింపుకు మీరు బ్యాంకులో దాచుకున్న డబ్బుపై వడ్డీతో కలిపి ఆదాయానికి ఏకంగా రూ.50 లక్షలు తేడా వస్తుంది. ఇక్కడ సొంత డబ్బుతో ఇల్లు కొనకుండా దానిని పెట్టుబడిగా పెట్టి రుణంతో ఇల్లు కొని ఈఎంఐ చెల్లించటం మీకు రూ.50 లక్షలు రాబడిని తెచ్చిపెడుతుంది.మీరు బ్యాంకులో తీసుకున్న రుణానికి అసలుతో పాటు వడ్డీని కలిపి చెల్లిస్తుంటారు. కానీ బ్యాంకులో చేసే ఫిక్స్ డ్ డిపాజిట్లపై మొదటి రోజు నుంచే 8 శాతం వడ్డీని అందుకుంటారు. ఇక్కడే అసలు రాబడి మ్యాజిక్ మొదలవుతుంది. కొంచెం రిస్క్ తీసుకునే ఇన్వెస్టర్లు అయితే ఈ రూ.80 లక్షలను 12 శాతం నుంచి 20 శాతం మధ్య రాబడిని అందించే మ్యూచువల్ ఫండ్స్ లో ఇన్వెస్ట్ చేసినట్లయితే బ్యాంక్ ఎఫ్ డి రాబడికి మించి చివరికి పొందుతారు. ఇలా రాబడి వచ్చేలా ప్లాన్స్ చేసుకోవటం వల్ల తర్వాతి తరాలకు ఆస్తిగా ఇంటిని అందించటంతో పాటు భారీ నగదును కూడా తల్లిదండ్రులు అందించటానికి వీలుంటుంది. ఎక్కువగా ఈ ప్లాన్ లోన్ ఈఎంఐలు చెల్లించటానికి రాబడి కలిగిన.. వ్యాపారులకు, ప్రతినెల ఆదాయం వచ్చేవారికి, ఐటీ ఉద్యోగులు వంటి వారికి ఉపయోగకరంగా ఉండవచ్చు.

# కేటీఆర్ కు మంత్రి కోమటిరెడ్డి కౌంటర్ చేసేదే చెప్తాం.. లేనిపోనిది చెప్పం మంత్రి..





**నల్గొండ: పెన్ పవర్:** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొననీ కేటీఆర్ కు రాజకీయం అంటే తెలవదు. తండ్రి చాటున కొడుకుగా వచ్చి కాంగ్రెస్ ఇచ్చిన హామీల గురించి మాట్లాడుతుండు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుంది. పేదోడి ఇంట్లో సన్న బియ్యం, ఉచిత బస్సు ప్రయాణం, ఐదు లక్షలతో పేదోడికి ఇల్లు కట్టిస్తున్నామని అన్నారు. కేసీఆర్ దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని మోసం చేసిండు. పదేళ్ల నాటి నుండి ఎక్కడ పేదోడికి ఇల్లు కట్టలే. కట్టినా ఏ ఒక్కరికి ఇవ్వలే. తక్కువ సమయంలోనే ఇచ్చిన హామీలను అమలు చేసి చూపిస్తున్నాం.. మీరు 10 ఏళ్ల నుండి ఏం చేశారు. విద్యుత్ రంగంలో కూడా అప్పు చేసిన మీరు.. మేము గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్ ద్వారా మోటార్లకు ఎలక్ట్రిసిటీ విద్యుత్ అందజేస్తున్నాం. అభివృద్ధిలో ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రులు ఎమ్మెల్సీలు కలిసికట్టుగా ముందుకు వెళ్తున్నాం. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా 6000 కోట్లు ఆర్టీసీకి కట్టాం. ఇచ్చిన మాట ప్రకారం పేదోడికి 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. రెండు లక్షల కోట్లు ఖర్చుపెట్టి పనికిరాని కాళేశ్వరం కట్టారు.. మూడు సంవత్సరాలు కట్టారు.. కట్టిన సంవత్సరానికి కూలిపోయింది. పదేళ్లు పట్టించుకోని ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు గురించి మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పిదంతోనే ఎస్ఎల్బీసీ లో ప్రమాదం జరిగింది. ఎస్ ఎల్ బి సి ప్రమాదంలో మంత్రులు ముఖ్యమంత్రి 65 రోజులుగా సహాయక చర్యలు చేపట్టాం. అనుకూల వాతావరణ పరిస్థితులు సహకరించకపోవడంతో జరిగిన ప్రమాదంపై కూడా రాజకీయం చేయడం సరికాదు. మీ చెల్లి మీ నాన్న మీ బావ మీరందరూ కలిసి ముందుగా మీ పార్టీని చూసుకోండి. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గ్రామ స్వరాజ్యం కోసం ఎలా పాటుపడ్డారో ప్రస్తుతం మేము అలాగే ముందుకు వెళ్తున్నాం. గ్రామీణ నిరుద్యోగ యువకులకు రాజు యువ వికాసం కింద ఆదుకుంటున్నాం. తెలంగాణ అవతరణ దినోత్సవం జూన్ 2న ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. 119 ఇంటిగ్రేటెడ్ స్కూలు కట్టబోతున్నామని అన్నారు.

# రైతుల కన్నీటితో తడిసిన వడ్ల కల్లాలు





**నల్గొండ: పెన్ పవర్:** ఉమ్మడి నల్గొండ జిల్లాలో పలు చోట్ల అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. దాంతో కొనుగోలు కేంద్రాల్లో రైతన్నలు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం దాదాపు 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉండగా, సేకరించిన ధాన్యం కూడా తరలించకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో దయనీయ స్థితిలో రైతులు పడిపోయారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం నీట మునుగాయి. రాష్ట్రంలో అన్నీ జిల్లాల్లో కుండపోత వర్షానికి ధాన్యం తడిసి, కొట్టుకుపోయింది. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కారణంగానే తమకు ఈ దుస్థితి వచ్చిందని కల్లాల వద్ద రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

## రాష్ట్రంలో పిడుగుపాటుకు నలుగురు మృతి



**హైదరాబాద్: పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో పిడుగుపాటుకు నలుగురు మృతి చెందారు. నల్గొండ జిల్లా అప్పాజీపేటలో మహిళా రైతు భిక్షమమ్మ (46), మహబూబాబాద్ జిల్లా ఓతాయిలో గొర్రెల కాపరి చేరాలు (55), గుడెంగలో ప్రవీణ్ కుమార్ (27) అనే వ్యక్తి, వనపర్తి జిల్లా మియాపూర్లో కొరవ నాగరాజు (18) అనే యువకుడు పిడుపాటుకు ప్రాణాలు కోల్పోయారు.
మరో 4 రోజుల పాటు పిడుగులతో కూడిన వర్షాలు ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు.